నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | జూన్ 24, 2024 | www.navatelangana.com

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మద్నూర్ బస్టాండ్‌లో పోలీసుల అవగాహన


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-మద్నూర్

సైబర్ నేరాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఆదివారం మద్నూర్ పాత బస్టాండ్‌లో ప్రయాణికులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఎక్కడి నుండో ఫోన్లు వస్తే వారికి మీ బ్యాంక్ అకౌంట్ నెంబర్, లేదా ఆధార్ నెంబర్, ఓటిపి ఇతర వివరాలు తెలుపవద్దని సూచించారు. గ్రామాలకు ఎవరైనా అనుమానితులు వస్తే అలాంటి వ్యక్తుల పట్ల ప్రజలకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎలాంటి మోసాలకు గురికావొద్దని, ముందు జాగ్రత్తగా సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలి పెంచాలి

- ప్రభుత్వ భూమి పంచాలి..
- వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా సెక్రెటరీ బి.వెంకట్


మాట్లాడుతున్న బి.వెంకట్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వ్యవసాయ కూలీలకు కనీస కూలి రూ.600 గా నిర్ణయించాలని, ప్రభుత్వం మిగులు భూములను పేదలకు పంచాలని అప్పుడే పేదలు, వ్యవసాయ కూలీల బతుకులు బాగుపడతాయని వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా సెక్రెటరీ బి.వెంకట్ తెలిపారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా నిజామాబాద్ నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సెమినార్‌లో అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ముఖ్యఅతిథిగా హాజరై కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు.

వివరాలు మెయిన్‌లో..

సగర్వంగా నీటిని అందిస్తున్నాం

- రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి
- ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మికాంతారావు
- నిజాంసాగర్ నీటి విడుదల


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-నిజాంసాగర్

సగర్వంగా నీటిని అందిస్తున్నామని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. ఆదివారం వీరిద్దరూ కలిసి నిజాంసాగర్ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ నుంచి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గత సంవత్సరంలో 21 జూన్ నీటిని నారుమడి కోసం వదిలామని, ఈసారి కూడా నీటిని నారుమడి వేసుకునేందుకు వదులుతున్నామని ఆయన అన్నారు. ప్రాజెక్టులో మొత్తం 4.33 టీఎంసీల నీరు ఉందని దీని ద్వారా రెండు విడతలలో 1300 క్యూసెక్కుల చొప్పున నీటిని వదులుతామని చెప్పారు. మొదటి విడత జూన్ 23 నుంచి జూలై 7 వరకు 15 రోజుల వరకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు. తర్వాత పది రోజులు నీటిని ఆపివేస్తామని, తిరిగి రెండో విడత జూలై 18 నుంచి జులై 27 వరకు నీటిని వదులుతామని వివరించారు. నిజాంసాగర్ నీటిని అలీసాగర్ వరకు ఇవ్వగలుగుతున్నామని రైతులందరూ అప్రమత్తంగా ఉండి నీరు వృథా చెయ్యకుండా నీటిని వినియోగించుకోవాలని ఆయన కోరారు. నిజాంసాగర్ చరిత్ర చాలా పురాతనమైనదని ప్రాజెక్టును 1932 సంవత్సరంలో నిర్మించి ప్రారంభించారని తెలిపారు. అప్పుడు 2,70,000 ఎకరాలకు నీరు అందేదని కాలక్రమేనా నిజంసాగర్‌కు రావలసిన వరద నీరు తగ్గడం వలన ఆ నీటిని అలీసాగర్ వరకు పరిమితం చేసి అలీసాగర్ వరకు ఒక లక్ష 30 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని ఆయన అన్నారు. మొత్తం పది మండలాల్లో మూడు నియోజకవర్గాల రైతులకు పంటలు పండుతున్నాయని ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ.. రైతులు నీటిని వృథా చేయవద్దని అన్నారు. రెండు విడతల్లో నాలుగు టీఎంసీల నీటిని రైతులకు అందిస్తున్నామని నారు పెరగడంతో నాట్లు వేసేందుకు నీరు లేకపోవడం వల్ల ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే ముఖ్యమంత్రి స్పందించి ప్రాజెక్టు సంబంధించి పూర్తి వివరాలు తీసుకొని సమీక్ష నిర్వహించి వెంటనే నీటిని వదలాలని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చాడని ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల నీరు ఉందని, కావున దీని పైన ఉన్న కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి ఇంకా రెండు టీఎంసీల నీరు తీసుకోవడానికి ఛాన్స్ ఉందని, కావున రైతులు జాగ్రత్తగా పంటలు వేసుకోవాలని ఆయన తెలిపారు. తెలంగాణలో ఏ రిజర్వాయర్‌లో నీళ్లు లేవని, కానీ మన నిజంసాగర్ ప్రాజెక్టులో మాత్రమే నీరు ఉందని ఆయన అన్నారు. యాసంగి పంటలో ఆరు విడతలలో నీటిని అందించామని అప్పుడు పొదుపుగా వాడటం వలనే ఇప్పుడు రిజర్వాయర్లో ఇంకా నాలుగు టీఎంసీల నీరు ఉందని ఆయన అన్నారు. కాల్వ కింద ఉన్న చివరి ఆయకట్టు రైతులు ఓపికతో నీరును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రాజెక్టులోని నీళ్లు చాలా స్వచ్ఛమైనవని, పంట పొలాలకు ఎలాంటి రోగాలు రావని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ శోభ రాజు, నిజాంసాగర్ ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోలమన్, ఏఈఈ శివ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మల్లికార్జున్, వైస్ ఎంపీపీ మనోహర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లల్లోకి చేరిన నిజాంసాగర్ నీరు



పరిమితికి మించి విడుదల చేయడమే కారణం.. పట్టించుకోని సంబంధిత అధికారులు

నవతెలంగాణ-నిజాంసాగర్

అసలే వర్షాలు లేక రైతులందరూ నీటి కోసం నానా తిప్పలు పడుతుంటే.. ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిజాంసాగర్ నీటిని నాట్లు వేయడానికి ప్రధాన కాలువ ద్వారా ఆదివారం నీటిని విడుదల చేశారు. కానీ ఆ కాలువను పరిశీలించే అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. దాంతో నిజాంసాగర్ నీరు ఇండ్లల్లోకి వచ్చి చేరింది. వివరాల్లోకి వెళ్తే.. మహమ్మద్‌నగర్ మండలంలోని గాలిపూర్ గ్రామంలో నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీటిని అధికారులు పరిమితికి మించి డిస్ట్రిబ్యూటర్ ద్వారా నీటిని విడుదల చేయడంతో ఇండ్లల్లోకి నీరు చేరింది. ఇలాంటి ఘటనలు గతంలో చాలాసార్లు చోటుచేసుకున్నాయి. ఆ సమయంలో అధికారులు వచ్చి కెనాల్‌లో గల మొక్కలను అన్నింటినీ తొలగిస్తామని, మరమ్మతులు చేపడతామని చేతులు దులుపుకున్నారు. మళ్ళీ ఆ వైపు కన్నెత్తి చూడలేదు. కాగా ఆదివారం నీరు విడుదల చేయగా.. కాలువలు సక్రమంగా లేకపోవడం ఓ కారణమైతే.. పరిమితికి మించి నీటిని విడుదల చేయడంతో ఇండ్లల్లోకి నీరు వచ్చి చేరాయి.


ఇంట్లోకి చేరిన నిజాంసాగర్ నీరు

పొదుపుగా వాడాలని చెబుతున్నా.. అధికారుల నిర్లక్ష్యం

'అసలే ప్రాజెక్టులో నీరు తక్కువగా ఉంది. నీటిని పొదుపుగా వాడుకోవాలి. నీటిని వృథా చేయెద్దు' అని ఆదివారం నీటి విడుదల సందర్భంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కానీ అధికారులు మాత్రం ఇవేమీ పట్టనట్టు వ్యవహరించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని చెప్పి గాలిపూర్ గ్రామస్తులు గతంలో చాలాసార్లు జలవనరుల శాఖ కార్యాలయం చుట్టూ తిరిగినా.. కార్యాలయంలో ఏ ఒక్క అధికారీ అందుబాటులో లేరని ప్రజలు తెలిపారు. నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట్ గ్రామ శివారులో ఇంజనీరింగ్ అధికారుల కార్యాలయం ఉంది. కార్యాలయంలో ఉండవలసిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) సోలమాన్ కార్యాలయంలో ఒక్కసారి కూడా అందుబాటులో ఉండడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయంలో అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

తైబజార్ వేలం ఎప్పుడో..?

వేలం ముగిసి మూడు నెలలైనా పట్టించుకోని అధికారులు


కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ పరిధిలో తై బజార్ వేలం మార్చి 2024తో ముగిసింది. ఏప్రిల్, మే, జూన్ మరో వారం రోజులైతే ముగిసిపోతుంది. అయినా ఇప్పటివరకు తై బజార్ వేలం వేసేందుకు మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నట్లు కనిపించడం లేదని వేలంలో పాల్గొనేందుకు ఎదురుచూస్తున్న పలువురు పేర్కొంటున్నారు.

ప్రతి సంవత్సరం ఈ తైబజార్ వేలం ద్వారా మున్సిపల్‌కు సుమారు రూ.20 నుంచి 25లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఈ డబ్బులతో మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టవచ్చు. మున్సిపల్ అధికారులు మాత్రం ఇప్పటివరకు ఈ వేలంపై ఎలాంటి ఆలోచనలు చేస్తున్నట్లు కనిపించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయంపై తెలుసుకునేందుకు మున్సిపల్ కమిషనర్‌ను కలిసేందుకు నవతెలంగాణ ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.

ఈ మూడు నెలల్లో మున్సిపల్‌కు వచ్చిన ఆదాయం ఎంత ?

తైబజార్ టెండర్ ముగిసి సుమారు మూడు నెలలవుతోంది. ఈ మూడు నెలల కాలంలో కాంట్రాక్టర్ వసూలు చేసిందెంత?, మున్సిపల్‌కు చెల్లించింది ఎంత అనే విషయాలు చెప్పడానికి అధికారులు ముందుకు రావకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పేద రైతులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి డిమాండ్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

పేద రైతులపై దాడి చేసిన వారిని శిక్షించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. నసురుల్లాబాద్ మండలంలోని నెమ్లి గ్రామంలో వ్యవసాయ భూమి విషయంలో భాగంగా జరిగిన ఘర్షణలో గాయపడిన పేద రైతులను సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్, జిల్లా కోర్ కమిటీ సభ్యులు రవీందర్, అలాగే మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకట్ గౌడ్ మాట్లాడుతూ.. నసురుల్లాబాద్ మండలంలోని నెమ్లి గ్రామంలో పేదల భూమిని అంబం మోహన్ అనే వ్యక్తి అదే గ్రామ శివారులో రెండు ఎకరాలు పేదల భూమిని ఆక్రమించుకున్నాడని, బాధిత రైతులు తమ భూమి అక్రమించుకున్నావు అని అడిగితే రాజకీయ బలంతో బెదిరించాడని తెలిపారు. దీంతో పేదలు గత ఆరు నెలల క్రితం స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ ముందు నెల రోజులపాటు నిరాహార దీక్ష చేశారని, ఎమ్మార్వో స్పందించి వారి భూమిని వారికి ఇవ్వాలని ఆదేశించాడని వివరించారు. తమ భూమి తమకు కావాలని కోరడంతో అంబం మోహన్ వారి కుటుంబ సభ్యులు కలిసి పేద రైతులైన గంగారాం, శ్రీను, మధు, శంకర్‌లపై దాడి చేశారని, హత్యా ప్రయత్నం చేశారని తెలిపారు. ఈ దాడి వెనుక ఎవరు ఉన్న వారందరిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు కోరారు. పేదల భూములను రక్షించాలని పేదలకు ఎలాంటి అన్యాయం జరిగినా సీపీఐ(ఎం) పోరాటం చేస్తుందన్నారు. పేద రైతులపై దౌర్జన్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సిపిఎం పార్టీ ముందుండి ఆందోళన కార్యక్రమాలు చేస్తుందని హెచ్చరించారు. వీరి వెంట జిల్లా కోర్ కమిటీ సభ్యులు రవీందర్, నాయకులు మధు, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.


బాధిత రైతులను పరామర్శిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

పేద రైతులపై దౌర్జన్యం..

తమకు చెందిన భూమి తమకే కావాలంటూ నెమ్లి గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేయడంతో అదే గ్రామానికి చెందిన అంబెం మోహన్ వారి కుటుంబ సభ్యులు పేద రైతులపై దౌర్జన్యం చేయడంతో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను బాన్సువాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మోహన్ కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు పోలీసులు తెలిపారు.

దారికి అడ్డంగా పశువులు

- రాకపోకలకు అంతరాయం



నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి పశువులు అడ్డంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని ఎల్లారెడ్డి - కామారెడ్డి ప్రధాన రహదారిపై ఆదివారం పశువులు రోడ్డుపై అడ్డంగా ఉన్నాయి. ప్రధాన రహదారి గుండా రోజుకు వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. దాంతో పాటు చాలామంది కాలినడకన సైతం వెళ్తారు. పశువులు రోడ్డుపై ఉండడంతో ప్రయాణికులతో పాటు పాదచరులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా రాత్రివేళ రోడ్డుపై వాహనదారులు ప్రయాణించాలంటే భయపడుతున్నారు. పశువులు అడ్డు రావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి పశువుల రోడ్లపై ఉండకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బస్సు షెల్టర్‌ను పట్టించుకోరేమీ..?

- చుట్టుపక్కల పిచ్చిమొక్కలు
- లేచిపోయిన రేకులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి స్టేజి వద్ద గల బస్సుషెల్టర్ ప్రయాణికులకు అందుబాటులో లేకుండా పోయింది. దాని చుట్టూరా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. అలాగే బస్సు షెల్టర్ రేకులు ఈదురుగాలులకు లేచిపోయాయి. అయినా వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. జాతీయ రహదారి నిర్వహణ అధికారులకు టోల్ ప్లాజాలో వసూళ్లపై ఉన్న శ్రద్ధ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం వర్షకాలం నేపథ్యంలో ప్రజలు వేచి ఉండేందుకు గానూ బస్సు షెల్టర్‌ను అందుబాటులోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే చుట్టు పక్కల పిచ్చిమొక్కలను తొలగించి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



చిత్తడిగా నాగన్‌పల్లి రహదారి

- మరమ్మతులకు నోచుకోని వైనం

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం నాగన్‌పల్లి గ్రామం వద్ద రహదారి వర్షానికి చిత్తడిగా మారింది. గ్రామం పక్కనుంచి బైపాస్ రోడ్డు పనులు కొనసాగుతుండడంతో ఈ రహదారిని పట్టించుకునేవారు లేకుండా పోయారు. రహదారి మొత్తం గుంతలమయం కావడంతో గత రెండు నెలల క్రితం కురిసిన వర్షానికి గుంతలలో నీరుచేరింది. దాంతో వాహనదారులపై బురదనీరు మీద పడటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారిగుండా ద్విచక్ర వాహనాలపై, ఆటోలలో విద్యార్థులు, ఉద్యోగులు వాహనాలపై వెళ్లినప్పుడు రోడ్డు మీద ఉన్న మురికినీరు మీద పడుతోంది. దాంతో బట్టలు పాడై విద్యార్థులు, ఉద్యోగులు, శుభకార్యాలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారిని మరమ్మతులు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.


బీటీ రోడ్డుపై మొరం వేయడంతో బురదగా మారిన రహదారి

ఏది నిజం.. ఏది కుట్ర..?

- పోచారం పార్టీ మారడంపై మతలబ్ ఏంటి ?
- వెన్నంటి ఉండి వెన్నుపోటు పొడిచారా..?

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆ నియోజకవర్గంలో రోజురోజుకూ రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. ఇదిలా ఉండగా.. బీఆర్ఎస్ పార్టీలో ముఖ్య నేతగా ఉండడం వల్లనే.. ఆ పార్టీలో ఉన్న కొందరికి అది జీర్ణం కాకపోవడంతో పోచారంపై బీఆర్ఎస్ పార్టీలో కొందరు ముఖ్య నాయకులు కుట్రపన్నినట్టు సమాచారం. అందులో భాగంగానే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తనయుడు పోచారం భాస్కర్‌రెడ్డి జిల్లా సహకార సంఘం అధ్యక్షుడిగా ఉండగా.. ఆయనపై బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు కలిసి అవిశ్వాసానికి నోటీసులు ఇచ్చి రాజీనామా చేసేలా చేశారని ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఆరు మాసాల్లో బాన్సువాడ నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరికతో.. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై కొంత మంది సోషల్ మీడియాలో దుష్ప్రచారాన్ని మొదలు పెట్టారు. పాత వీడియోలను తీసుకువచ్చి ఇట్లెట్లా చేస్తావ్ అంటూ సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరానని పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేస్తున్నారు. కానీ వారి అంతర్గత అనుచరులు మాత్రం పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎదుగుదలను చూడలేక బీఆర్ఎస్‌లో కుట్ర పన్నినట్టు చెబుతున్నారు.

జరిగింది ఏమిటి..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తిరుగులేని నాయకుడు మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి. గత 30 ఏండ్లుగా బాన్సువాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలుస్తూ జిల్లాలో, రాష్ట్రంలో అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచారు. అలాంటి నేతకు కాంగ్రెస్ పార్టీలో చేరవలసిన అవసరం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. ప్రజా నాయకుడు. ఉన్నట్టుండి అలాంటి నేతకు పార్టీ మారాల్సిన గత్యంతరం ఎందుకు వచ్చింది. తన నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో అనుభవించలేని పదవులంటూ ఏమీ లేవు. కష్టపడి పైకి వచ్చిన అతనికి ఎన్నో పదవులు వరించాయి. రాష్ట్ర అసెంబ్లీలో అన్నిటికంటే పెద్ద ప్రోటోకాల్ పదవి స్పీకర్ పదవి చేపట్టారు. తెలంగాణ స్ఫూర్తికుడిగా పేరొందిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వెన్నంటి ఉంటూ వెన్నుపోటు పొడుస్తున్న నాయకుల తీరు పోచారం బయటకు వెళ్ళేందుకు అసలు కారణం అయిందా? ఉమ్మడి జిల్లాలో ఓ నియోజకవర్గ ముఖ్యనేత అదృష్టం కొద్ది రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్రంలో ఉన్నత స్థానంలో నిలిచారు. అలాంటి ముఖ్యనేత చేష్టలే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పార్టీ మారేందుకు కారణం అయిందని సమాచారం. ఉమ్మడి జిల్లాలో ఉన్న ఆ ముఖ్య నేత కెసిఆర్‌కు, కేటీఆర్‌కు అతి సన్నిహితుడిగా ఉండడం చేత ఉమ్మడి జిల్లాలో ఏకాధిపత్యం, చక్రం దింపడంలో దిట్ట.

ముఖ్యనేతకు డిసిసిబి పదవి వచ్చేలా కృషి ?

ఆ ముఖ్య నేతకు అతి స్నేహితుడైన ఓ ఆత్మలాగా ఉన్నా వేల్పూర్ సహకార సంఘం చైర్మన్‌గా ఉన్న రమేష్‌రెడ్డిని జిల్లా సహకార సంఘం చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చేశారు. తన ఆత్మ లాగా ఉన్నా రమేష్‌రెడ్డికి నిజామాబాద్ డిసిసిబి చైర్మన్ పదవిని కట్టబెట్టడానికి వెనక నుంచి చక్రం తిప్పి డైరెక్టర్లతో అవిశ్వాస పెట్టించారనే ఆరోపణ ఉంది. ప్రతి సభలో సమావేశంలో తండ్రి లాంటి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అని అనేవారు. పోచారం తనయుడికి వెన్నుపోటు పొడిచి పోచారం భాస్కర్‌రెడ్డిని డిసిసిబి చైర్మన్ పదవి నుంచి తప్పించడానికి తెరవెనుక సహకారం అందించారని పోచారం వర్గాలు పేర్కొంటున్నాయి.

ఎవరు కుట్రదారులు..?

బీఆర్ఎస్ పార్టీని నమ్ముకుని ఉన్న పోచారం కుటుంబానికి జరిగిన అన్యాయంలో ఎవరి తప్పుంది. జరిగిన తప్పును తేటతెల్లం చేసినప్పటికీ అధిష్టానం ఇంకా ఉమ్మడి జిల్లా ఆ ముఖ్య నాయకుడి భ్రమలోనే ఉమ్మడి జిల్లా నాయకులు నేతలు ఉన్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఆ ముఖ్య నేత కేసీఆర్‌పై ప్రేమను శాశ్వతంగా గుండెలో పెట్టుకుని కేవలం తన రాజకీయ శత్రువులకు సమాధానం ఇచ్చేందుకు పోచారం ఈ అడుగు వేశారని పోచారం శ్రీనివాస్‌రెడ్డి వర్గీయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

భర్తను హత్య చేసిన భార్య

- మామతో కలిసి ఘాతుకం
- స్థానికులు నిలదీయడంతో వెలుగులోకి వచ్చిన వైనం
- ఇద్దరిపై కేసు నమోదు


ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

కట్టుకున్న భర్తను తన మామతో కలిసి హత్యచేసిందో భార్య. ఈ ఘటన బాన్సువాడ మండలం తిర్మలాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాన్సువాడ టౌన్ సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. తిర్మలాపూర్‌కు చెందిన రాములు (33) జులాయిగా తిరుగుతుండేవాడు. మద్యం తాగి వచ్చి భార్య మంజులను, తండ్రి నారాయణను కొడుతూ హింసించేవాడు. దీంతో విసిగిపోయిన వారిద్దరూ కలిసి ఈ నెల 9న రాములును హత్య చేశారు. మృతదేహాన్ని రెండురోజుల పాటు ఇంట్లోని సెప్టిక్ ట్యాంకులో ఉంచారు. అనంతరం ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో గుంత తవ్వి పూడ్చిపెట్టారు. గత పది రోజులుగా రాములు కనిపించకపోవడంతో ఇంటిపక్కన ఖాళీ స్థలంలో తవ్విన గుంత అనుమానాస్పదంగా కనిపించడంతో స్థానికులు వారిద్దరినీ నిలదీశారు. దీంతో వారిద్దరూ రాములును హత్య చేసినట్లు చెప్పడంతో శనివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాన్సువాడ పోలీసులు ఆదివారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని గుంతను తవ్వగా మృతదేహాన్ని గుర్తించారు. దీంతో పోలీసులు రాములు భార్యపై, తండ్రిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి

నవతెలంగాణ-బాల్కొండ

డాక్టర్ కావాలని లక్ష్యంతో ఎంతో కష్టపడి నీట్ పరీక్ష రాసిన విద్యార్థుల కలలకు గండి కొట్టారని అబ్బగోని అశోక్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని తక్షణమే పరీక్షలను మళ్లీ నిర్వహించి అర్హత గల వారికి అవకాశం వచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని ప్రకటించాలని అబ్బగోని అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష పత్రాలు లీకేజీ జరగడం వల్ల అర్హత గల అభ్యర్థులు డాక్టర్లు కాకపోతే ఎటువంటి అర్హతలు లేనివారు వైద్యం మీద అవగాహన లేనటువంటి డాక్టర్లు సమాజంలోకి వచ్చినట్టయితే ప్రజలు వారి చేతిలో ప్రాణాలను పెట్టి చికిత్స చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల నీట్ పరీక్షలో అర్హత గలవారు నష్టపోయారని పేర్కొన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం మళ్లీ నీట్ పరీక్ష పారదర్శకంటా నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పరీక్ష రాసిన విద్యార్థులు, వారి కుటుంబాలతో రోడ్లమీదకి వచ్చి ధర్నా చేస్తామని హెచ్చరించారు .

కేంద్ర గ్రంథాలయంలో మధ్యాహ్నం భోజనం పెట్టించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేంద్ర గ్రంథాలయంలో మధ్యాహ్నం భోజనం పెట్టించాలని ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా ఎంపి ధర్మపురి అరవింద్‌కు నగరంలోని కేంద్ర గ్రంథాలయం సమస్యలు పరిష్కరించాలని వతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ నిజామాబాద్ అధ్యక్షురాలు అంజలి మాట్లాడుతూ నిరుద్యోగులు దూర ప్రాంతాల నుండి వచ్చి రూమ్స్ తీసుకొని ఉదయం 4 గంటల నుండి రాత్రి 10 గంటల లైబ్రరీలో చదువుకుంటున్నారని అన్నారు. గతంలో మాజీ (ఎంపీ కవిత) 2018 నుండి 2024 వరకు బువ్వ కుండ ద్వారా రోజు 500 మంది నిరుద్యోగులకు భోజనం పెట్టే వారని తెలిపారు. తరువాత ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తా రెండు నెలలు పెట్టించారని అన్నారు. లైబ్రరీలో 500 మంది చదువుకోవడానికి వస్తున్నారని, 300 మందికి భోజనాలు పెట్టించాలని నిరుద్యోగులకు సమయం వృధా కాకుండా కేంద్ర గ్రంథాలయంలోనే మధ్యాహ్న భోజనం పెట్టించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లావణ్య, శ్వేత, శ్రావ్య, తిరుపతి, సతీష్, అశోక్, అభి తదితరులు పాల్గొన్నారు.

శ్యామ ప్రసాద్ ముఖర్జీకి నివాళులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారతీయ జనతా పార్టీ అర్బన్ శాఖ ఆధ్వర్యంలో బలిదాన్ దివస్ సందర్భంగా జనసంఘ్ వ్యవస్థపాక సభ్యులు శ్యామ ప్రసాద్ ముఖర్జీకి అర్బన్ ఎమ్మెల్యే ధన్ పల్ సూర్యనారాయణ ఘన నివాళ్లు అర్పించారు.

ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ.. శ్యామ ప్రసాద్ ముఖర్జీ న్యాయవాదిగా, విద్యావేత్తగా 33 ఏళ్ల చిన్న వయస్సులో కలకత్తా యూనివర్సిటీ విసిగా పనిచేశారని అన్నారు. అఖిల భారతీయ హిందూ మహాసభల అధ్యక్షులుగా సేవలందించి, భారతదేశ మొదటి వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేశారని అన్నారు. ఆయన మరణం కూడా నిర్బంధం లోనే ఒక మిస్టరీగా మిగిలిపోయిందని, ఆ మహనీయుని త్యాగానికి గుర్తుగా బలిదాన్ దివస్ జరుపుకుంటున్నామని అన్నారు. ముఖర్జీ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా బిజెపి పార్టీ నరేంద్రమోదీ పని చేస్తున్నారని తెలిపారు. యువత ఆ మహనీయుని ఆదర్శంగా తీసుకొని దేశ సమగ్రత్త, స్వేచ్ఛ కోసం ప్రాణాలు అర్పించడానికైనా సిద్ధంగా ఉండాలన్నారు, అనంతరం బీజేపీ నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నాలం రాజు, బిజెపి అర్బన్ అసెంబ్లీ కో కన్వీనర్ రాగి నారాయణ యాదవ్,బీజేపీ కార్పొరేటర్స్ మాస్టర్ శంకర్,మల్లేష్ యాదవ్, బీజేపీ ఆఫీస్ సెక్రటరీ బద్ద కిషన్, మండలం అధ్యక్షులు గడ్డం రాజు, పుట్ట వీరేందర్,బీజేపీ నాయకులు ప్రభాకర్, ఆనంద్, ముత్యాలు,పల్నాటి కార్తీక్,రాథోడ్, హరీష్,తదితరులు పాల్గొన్నారు.

అమీనాపూర్‌లో వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్

అమరుడు ప్రజాపంథా పార్టీ నిర్మాణానికి మొదట అడుగులు వేసిన కామ్రేడ్ డివి కృష్ణ రెండో సంస్మరణ సభను విజయవంతం చేయాలని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథ నాయకులు డివిజన్ రమేష్ అన్నారు. ఆదివారం వేల్పూర్ మండలంలోని అమినాపూర్ గ్రామంలో ఆదివారం రెండో సంస్మరణ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాల పాటు విప్లవోద్యమంలో అలుపెరగని పోరాటం చేసిన కామ్రేడ్ డివి కృష్ణ తన ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలేసి నిజామాబాద్ జిల్లాలో విప్లవోద్యమనికి అడుగులు వేశారన్నారు. తన చివరి తుది శ్వాస వరకు సైదాంతికత రాజకీయ రంగాలఅన్నిటిని నిశితంగా పరిశీలన చేసి సరైన సిద్ధాంతం కోసం మొక్కవోని పోరాటం చేశాడ నీ అన్నారు. సైదాంతిక రాజకీయ విషయాలను ప్రజా ఉద్యమ ఆచరణతో జోడించి కృషి చేశాడని తెలిపారు. రెండవ వర్ధంతి సందర్భంగా నిజమాబాదులో వారి స్మారక స్తూపాన్ని ఏర్పరచామని, ఈనెల 26న స్తూప ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని అన్నారు. ప్రజలు కూడా భారీ ఎత్తున ప్రజలు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కలిగోట రాజు గౌడ్ , తలారి మగ్రాన్న అముస్, సృజన్, జ్యోతి, సత్తెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టివియువి అకాడమీ ఎక్సెలెన్స్ అవార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న టివియువి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాల్‌సింగ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

టివియువి అకాడమీ ఎక్సెలెన్స్ అవార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలని టివియువి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాల్‌సింగ్ అన్నారు. వినాయక్ నగర్ లోని టివియువి కార్యాలయం లో టివియువి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్ సింగ్ ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టివియువి) ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో కళాశాల వారిగా ఉత్తమ ఫలితాలు సాధించిన వారు అకాడమీ ఎక్సెలెన్స్ అవార్డు కొరకు నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంటర్‌లో అధిక మార్కులు సాధించిన ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డుతో సన్మానం చేశారు. అకాడమీ ఎక్సెలెన్స్ అవార్డు 2023-24 కోరకు విద్యార్థులు తమ కళాశాల కరపత్రం లెదా మార్కుల మెమో తో పాటు విద్యార్థి ఫొటోలు పంపాలని అన్నారు. vuvexcellenceaward@gmail.com 7013443741, 9948010110 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో టివియువి జిల్లా కన్వీనర్ అజయ్, నగర అధ్యక్షుడు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లి: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న నాయకులు



కమ్మర్‌పల్లిలో...

ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ హర్షణీయం

- సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఆర్మూర్

ఏకకాలంలో రుణమాఫీ చేయడం హర్షనీయమని పట్టణ కాంగ్రెస్ నాయకులు అన్నారు. పట్టణంలోని పివిఆర్ భవన్ లో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు సాయిబాబా గౌడ్, నాయకులు గోర్త దేవేందర్ మాట్లాడుతూ ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుల పక్షాన అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వచ్చిన 100 రోజుల్లోనే గ్యారెంటీ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తుందని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసి ఆదుకుంటారని తెలిపారు. రైతులు రాష్ట్ర ప్రజలు కూడా సీఎం రేవంత్ రెడ్డికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సాయిబాబా గౌడ్ మాజీ మున్సిపల్ చైర్మన్ పండిత్ పవన్ జంబి హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ పట్టణ కౌన్సిలర్ కొంత మురళి ,కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్ రెడ్డి , కొక్కెర భూమన్న , నల్లగొండ హరీష్ ,అజ్జు బాయ్ మహేందర్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : ఏకకాలంలో రెండు లక్షలు రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని రైతులు బాధలు తెలిసిన సీఎం ఏకకాలంలోనే రెండు లక్షల రుణమాఫీ సర్వం సిద్ధం చేయడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తానని క్యాబినెట్లో తీర్మానించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో మాట ఇచ్చిన ప్రకారం వరంగల్ డెక్లరేషన్‌లో పేర్కొన్నట్లుగా ఏకకాలంలో రూ.2లక్షల రుణ మాఫీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారన్నారు. ఈ విషయమై క్యాబినెట్ లో చర్చించి ఆగస్టు 15లోపు ఏక కాలంలో రూ. 2 లక్షలు రుణ మాఫీ చేస్తామని క్యాబినెట్ తీర్మానం చేసినందుకు కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సుంకేట రవి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగేలా ప్రవీణ్, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బోనగిరి భాస్కర్, తిప్పిరెడ్డి శ్రీనివాస్, పాలేపు నర్సయ్య, గోపీడీ లింగారెడ్డి, తక్కురి దేవేందర్, సుంకేట భూచ్చన్న, అల్లాకొండ రాజేష్, సింగిరెడ్డి శేఖర్, కొమ్ముల రాజేందర్, వేముల గంగారెడ్డి, జైడి శ్రీనివాస్, కుందేటి శ్రీనివాస్, సుంకేట శ్రీనివాస్, భూచ్చి మల్లయ్య, ప్రసాద్, సంజీవ్, రవీందర్, సృజన్, అనిల్, గంగారెడ్డి, భూమారెడ్డి, నర్సయ్య మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : ఇందల్ వాయి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి చిత్రపటాలకు కిసాన్ ఖేత్ మండల అధ్యక్షులు ఎల్‌ఐసి గంగాధర్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. పటాకులు కాల్చి, సీట్లు పంచారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా కిసాన్ కేత్ మండల అధ్యక్షుడు ఎల్‌ఐసి గంగాధర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో



డిచ్‌పల్లి: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్ర రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రుణమాఫీ పైగా మూడు రోజుల క్రితం క్యాబినెట్ సమావేశమై రైతన్నలకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయలు మాఫీ చేస్తామని అ

మోదం కావడంతో ఇందల్ వాయి మండల రైతుల పక్షాన వారికి రుణపడి ఉంటామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని, చెప్పింది చేసి చూపుతుందని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ సమయంలో రైతులకు ఏకకాలంలో లక్షా రుణమాఫీ చేశామన్నారు.

పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటికి ఖజానా మొత్తం ఖాళీగా ఉందని అన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉచుకొని లక్షలాది రైతులకు రుణమాఫీ చేయడం దేశ చరిత్రలోనే మొట్టమొదటిదన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ రైతులకు ఏకకాలంలో లక్ష రూపాయల మాఫీ చేయలేదని, కొందరికి మాఫీ చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీల్లో భాగంగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ ప్రకటించడం పట్ల రైతులే కాకుండా ఇతర పార్టీలకు చెందిన నాయకులు సైతం హర్షం ప్రకటిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్యార్ నవీన్ గౌడ్, మాజీ ఎంపీపీ, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇమ్మడి గోపి, బ్లాక్ కాంగ్రెస్ రూరల్ అధ్యక్షులు చిన్ రెడ్డి సంతోష్ రెడ్డి, డిసిసి డెలిగేట్ సుధాకర్, మాజీ మండల అధ్యక్షుడు గుట్ట గంగాధర్, డాక్టర్ రాజేశ్, సొసైటి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మండల ట్రెజరర్ కుంట గంగారెడ్డి, బోర్‌వెల్ రాజేందర్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రూరల్ అధ్యక్షులు ఆశిష్, రతన్, హబీబ్, సద్దాం, మాజీ ఉప సర్పంచ్లు బైరయ్య, నవీన్ గౌడ్, మాజీ సర్పంచ్ రాములు నాయక్, నరేష్, ఇర్ల సాయందర్, ఎరుకల ప్రసాద్, రత్నునాయక్,అంబర్ సింగ్ రైతు నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ కంటే తక్కువకే పాఠశాలల్లో అమ్మకాలు చేయాలి

- తెలంగాణ విద్యార్థి పరిషత్

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

ఎమ్మార్పీ కంటే తక్కువ ధరకే పాఠశాలలలో పుస్తకాలు అమ్మకాలు చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సజ్జన భానుచందర్ అన్నారు. తెలంగాణ విద్యార్థి పరిషత్ అధ్వర్యంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జనం భానుచందర్ మాట్లాడుతూ.. శనివారం ట్రస్మ (ప్రైవేటు స్కూలు యాజమాన్యాలు ఏర్పాటు చేసుకున్న సంఘం) కు సంబంధించిన కొంత మంది పాఠశాల యాజమాన్యాలు డిఇఓని కలిసి ప్రైవేట్ పాఠశాలల మీద విద్యార్థి సంఘాల ఆగడాలను ఆపాలని వినతి పత్రం అందజేశారన్నారు. కోర్టు ఆర్డర్ ఏదైతే ఉందో అది కేవలం "నో ప్రాఫిట్ నో లాస్" స్కీం కింద మాత్రమే కేవలం టెక్స్ట్ బుక్స్ మాత్రమే స్కూల్లో అమ్మవచ్చని చెప్పేసి కోర్టు ఆర్డర్ ఆదేశాలు ఇచ్చారని అన్నారు. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యులు మాత్రం స్కూళ్లలో నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్ యూనిఫార్మ్, సాక్స్, బెల్ట్, షూస్ అమ్మడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 18న డీఈవో స్కూళ్లలో ఎటువంటి యూనిఫామ్స్ టెక్స్ట్ బుక్స్ ఇతర వస్తువులను అమ్మకూడదని పత్రిక ముఖంగా తెలిపారని, అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారని తెలిపారన్నారు. అయినా కొంతమంది తల్లిదండ్రుల కంప్లైంట్ వల్ల మొన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ఎల్లమ్మ గుట్ట స్కూల్లో అధిక రేట్లలో ఉన్న నోట్ పుస్తకాలు యూనిఫాం అమ్ముతున్నట్లు తెలంగాణ విద్యార్థి పరిషత్‌కు కంప్లైంట్ వచ్చిందన్నారు. స్కూలుకు వెళ్లి కి చూడగా అక్కడ ఆఫీస్ రూమ్‌లో మొత్తం కిరాణా సామాను(ఉస్మానియా బిస్కెట్స్, కురు కురే వంటి తినుబండారాలు)ప్రిన్సిపాల్ విద్యార్థులకు అమ్ముతున్నారని



మాట్లాడుతున్న విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భానుచందర్

అన్నారు. ఈ విషయంపైనే డీఈఓ, ఎంఈఓ లకి ఫోన్ ఫోన్ ద్వారా విషయాన్ని తెలియజేయగా ఉపాధ్యాయుల బదిలీల్లో బిజీగా ఉన్నామని చెప్పారన్నారు.

ఇప్పుడు ఆఫీస్ నుంచి ఎవరు కూడా రారని చెప్పేసి చేతులు దులుపుకున్నారని అన్నారు. దీనికి సాకుగా చేసుకొని, యాజమాన్యం విద్యార్థి నాయకులతో ఎవరికి చెప్పుకుంటారో... చెప్పుకోండి అని దురుసుగా మాట్లాడారని తెలిపారు. పాఠశాలలో ఎంఆర్పి కే అమ్మితే సెల్లర్ ప్రాఫిట్ తీసుకుంటున్నట్టుగా లెక్క, కాబట్టి ఎంఆర్పి ధరతో బిజినెస్ చేస్తున్నట్టుగానే భావించబడుతుందని అన్నారు. అందుకు డిఇఓ, కలెక్టర్ ఇటువంటి పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవి సెలవులు మొదలవగానే పాఠశాలలో రూములు కేటాయించి మరి బుక్స్ ని దిగుమతి చేసుకుంటున్నారని తెలిపారు. కొన్ని పాఠశాలల్లో రూముల నిండా నోటు పుస్తకాలు ఉంటున్నాయని, ఇదేమని ప్రశ్నించిన విద్యార్థి సంఘాలను కేసులు పెడతాం అని బెదిరింపులకు గురి చేస్తున్నారని అన్నారు. విద్యార్థి సంఘాలు ప్రశ్నించడం మానేస్తే పాఠశాలల్లో పిన్నీసులు..., రబ్బర్ బ్యాండ్‌లు... సైతం అమ్మే స్థాయిలో, కొన్ని ప్రైవేటు యాజమాన్యాలు ఉన్నాయని ఆరోపించారు. డి ఈ ఓ చెప్పినట్టు ఎంఆర్‌పీ కంటే ఎక్కువ రేట్లు అమ్ముతున్న పాఠశాలల పైన కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కళ్యాణ్, నాయకులు మహేష్, సుజిత్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసిపి బస్వారెడ్డి

కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి

- ఏసిపి బస్వా రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థులు చిన్ననాటి నుంచి కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని పట్టణ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బస్వా రెడ్డి అన్నారు. పట్టణంలోని క్షత్రియ యువజన సమాజ్ ఆధ్వర్యంలో క్షత్రియ పేద విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ . కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్షత్రియ యువజన కార్యవర్గం సభ్యులు, పెద్దలు మాట్లాడుతూ... క్షత్రియ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని శ్రద్ధగా చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్షత్రియ సమాజ్ నాయకులు కాందేశ్ శ్రీనివాస్, పండిత్ ప్రేమ్ ,గంగా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు మండల అధ్యక్షులుగా గుట్ట గంగాధర్ ఎన్నిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండల మున్నూరు కాపు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలో మున్నూరు కాపులు సమావేశమై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందల్‌వాయి మున్నూరు కాపు మండల అధ్యక్షుడిగా మండలంలోని లోలం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుట్ట గంగాధర్‌ను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మాజీ ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్, గడ్కోల్ శ్రీనివాస్ లను ఎన్నుకున్నారు.మండల కమిటీ ఉపాధ్యక్షుడిగా సంస్థాన్ సిర్నపల్లి గ్రామానికి చెందిన ఎల్ ఐ సి గంగాధర్, గన్నారం గ్రామానికి చెందిన ఉంగరాల శ్రీనివాస్, నల్లవెల్లి గ్రామానికి చెందిన సాంబార్ విఠల్, ప్రధాన కార్యదర్శిగా ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామానికి చెందిన సాధు రవి , సహాయ కార్యదర్శిగా మల్లాపూర్ గ్రామానికి చెందిన జల్లల శ్రీనివాస్, కోశాధికారిగా అమ్సన్ పల్లి గ్రామానికి చెందిన దొంతుల గంగాధర్,

కార్యదర్శులను, సలహాదారులను, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గుట్ట గంగాధర్, కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని, ఏ పార్టీ కి చెందిన వారున్నా కులం కోసం ఒకే మాట మీద కట్టుబడి ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలో వేలాది సంఖ్యలో మున్నూరు కాపులు ఉన్నారని, వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, ఎల్లవేళలా సహాయ సహకారాలు అందజేస్తూ అందరి సహకారంతో సమస్యలను పరిష్కరించుకుంటా మన్నారు. తమపై నమ్మకం ఉంచి ఏకగ్రీవం చేసిన మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన మున్నూరు కాపులకు ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు నాయిడి రాజన్న, పులి సాగర్,



ఎన్నికైన సంఘం సభ్యులు

బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పులి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తేలు విజయ్ కుమార్, కచ్చకాయల శ్రీనివాస్, ధర్పల్లి ప్రభాకర్, దర్శపు గంగమోహన్, శీలం పెద్ద రాజన్న, పాల్దే శ్రీనివాస్, సాయి రెడ్డి శ్రావణ్, గట్టు కడారి, గోపు గోపాల్,తో పాటు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మున్నూరు కాపులు పాల్గొన్నారు.

గుంతలను పూడ్చిన కాంగ్రెస్ నాయకులు



గుంతను పూడుస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని గుండూరు రోడ్డు, బస్టాండ్ ఆవరణలో గల రహదారులపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అస్పత్‌వార్ వినోద్ కంకర మిశ్రమంతో గుంతలను ఆదివారం పూడ్చివేయించారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల కారణంగా ఆగిపోయిన ఆ రోడ్డు, బస్టాండ్ పనులు త్వరలోనే ప్రారంభించడానికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మన్ పటేల్, మాజీ ఎంపీటీసీ ఇమ్రాన్ ఖాన్, అనిల్ సెట్, అస్పత్‌వార్ అరుణ్, గాయక్వాడ్ విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కట్ట మైసమ్మ పండుగ



పూజలు చేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని ఖంబాపూర్ గ్రామంలో కట్ట మైసమ్మ పండుగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రతి సంవత్సరం ఆనవాయితీగా కట్ట మైసమ్మ పండుగను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం సైతం ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో రమేష్ దేశాయ్, వీర్ సంగప్ప దేశాయి, ప్రమోద్ పాటిల్ గ్రామస్తులు పాల్గొన్నారు.



లింగంపేట: సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు



నాగిరెడ్డిపేటలో...



రెంజల్‌లో...

రుణమాఫీ ప్రకటన పట్ల హర్షం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-విలేకరుల బృందం

లింగంపేట్ : మండలంలోని పర్మల్ల గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు చిత్రపటాలకు రైతులు, కాంగ్రెస్ నాయకులు ఆదివారం పాలాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రెండులక్షల రుణమాఫీ ఆగస్టు 15లోగా మాఫీ చేస్తానని మంత్రివర్గ సమావేశంలో తీర్మానించడంతో హర్షం వ్యక్తం చేస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల నాయకుడు కోడ బోయిన సాయికుమార్ మాట్లాడుతూ.. ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతని తెలిపారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలో ఇప్పటివరకు రైతులకు రుణమాఫీ చేయలేదన్నారు. పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలన లక్ష రూపాయల రుణమాఫీ చేస్తానని హామీనిచ్చి పది సంవత్సరాల్లో ఏ ఒక్క రైతునూ ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. గత రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని రైతులు ఎన్నో సంవత్సరం నుంచి ఎదురుచూస్తున్న కళ నెరవేరిందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయికుమార్, ఈర శ్రీనివాస్, గంట ఇస్తారి, గంగారెడ్డి, నరేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రూపాయలు ఏకకాలంలో మాఫీ చేస్తామని ప్రకటించడంతో కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం, వెంకంపల్లి, ఆత్మకూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాలలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకకాలంలో రుణమాఫీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పోచారం కాంగ్రెస్ పార్టీకి గ్రామ అధ్యక్షుడు కిరణ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో ప్రభుత్వం రుణమాఫీ ప్రకటన కాంగ్రెస్ వర్గీయులలో ఆనందోత్సవాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాటాపూర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని కొనియాడారు. వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం రుణమాఫీ చేయడానికి ముందుకు వచ్చిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు జి.సాయిరెడ్డి, ధనుంజయ్, సిహెచ్ రాములు, సురేందర్ గౌడ్, సాయిబాబాగౌడ్, ఎమ్మెల్ రాజు, గంగాకృష్ణ, నరసయ్య, కార్తీక్ యాదవ్, సంజీవ్, సొక్కుల సాయిలు, కుద్దూస్, సద్దాం, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రామారెడ్డి: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

చెప్పింది చేసేదే కాంగ్రెస్ ప్రభుత్వం..

రామారెడ్డి : చెప్పింది చేసేదే కాంగ్రెస్ ప్రభుత్వమని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రైతు రుణమాఫీ ప్రకటన సందర్భంగా సోనియాగాంధీతో పాటు రేవంత్‌రెడ్డి, షబ్బీర్ అలీ, మదన్మోహన్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ పేద బడుగు బలహీనవర్గాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన ఆరు హామీలను అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నదని వివరించారు. కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తల కాయకష్టమే నేడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని మోహన్‌రెడ్డి గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొల్లపల్లి లక్ష్మా గౌడ్, నాయకులు గిరెడ్డి మహేందర్‌రెడ్డి, బండి ప్రవీణ్, మహమ్మద్ అనీఫ్, నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రెడ్డి నాయక్, పెండ్యాల నర్సారెడ్డి, బిపేట నర్సింలు, కిషన్‌గౌడ్, బైరయ్య, తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్‌లో బోనాల పండుగ



బోనాలతో ఊరేగింపులో గ్రామస్తులు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో ఆదివారం గ్రామ ప్రజలు నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. భాజా భజంత్రీలతో బోనాలతో నల్ల పోచమ్మ ఎర్ర పోచమ్మ ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

ఓం శాంతి 59వ పుణ్యస్మృతి దివస్

- పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని 18 వార్డులోని ఓంశాంతి కాలనీలో నిర్వహించిన 59వ పుణ్యస్మృతి దివాస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవనశైలి మార్చుకోవాలని సూచించారు. సమస్యలు అనేవి మానవులకి వస్తాయని, ఆ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలనేవి ఓంశాంతి ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్, హఫీస్ బాగ్ మిర్జా, పాత శివ కృష్ణమూర్తి, మాజీ కౌన్సిలర్ సుధాకర్, బ్రమ్మ కుమారీలు తదితరులు పాల్గొన్నారు.

దీపక్ బైజును సన్మానించిన ఎస్టీ సెల్ నాయకులు



దీపక్ బైజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో చత్తీస్‌ఘడ్‌లో ఆదివాసులపై జరుగుతున్న హత్యకాండను నిలిపివేయాలని ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సదస్సులో ముఖ్యఅతిథిగా చత్తీస్‌ఘడ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) రాష్ట్ర అధ్యక్షులు దీపక్ బైజు హాజరయ్యారు. అలాగే వారితోపాటు కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్ హాజరయ్యారు. హైదరాబాద్‌కు వచ్చిన చత్తీస్‌ఘడ్ పిసిసి రాష్ట్ర అధ్యక్షులు దీపక్ బైజును కామారెడ్డి జిల్లా ఎస్టి సెల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ రాణా ప్రతాప్ రాథోడ్, భూక్యా రాజు నాయక్, సదర్ నాయక్, మోహన్ నాయక్, శ్రీను నాయక్, కృష్ణా నాయక్, రవి నాయక్, కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుపడితే.. సీటు దక్కాల్సిందే...

- బస్సులో సీటు కోసం ఓ ప్రయాణికుడు పాట్లు

నవతెలంగాణ-బోధన్

బస్సులో సీటు దొరకడం గగనంగా మారడంతో ఓ ప్రయాణికుడు ఆదివారం బస్సులో సీటుకోసం బస్సు కిటికీలో నుంచి బస్సులో దూరే ప్రయత్నం చేశాడు. ఆ దృశ్యాన్ని నవతెలంగాణ క్లిక్ మనిపించింది. ఈ ఘటన చూసిన వారు పట్టుబడితే సీటు దక్కాల్సిందే అంటూ కామెంట్లు చేశారు.



బస్సు కిటికి నుంచి లోనికి వెళ్తున్న ప్రయాణికుడు

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాం

- పోచారంతో కలిసి పనిచేస్తాం
- పీసీసీ డెలిగేట్ డా.కూనిపూర్ రాజారెడ్డి

నవతెలంగాణ-వర్ని

మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పార్టీ కోసం పనిచేస్తామని పిసిసి డెలిగేట్ డా.కునీపూర్ రాజారెడ్డి, మండలాధ్యక్షులు సురేష్ బాబా తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.. పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించడం శుభ పరిమాణమని తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు పోచారం శ్రీనివాస్‌రెడ్డితో నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆయనతో కలిసి ఉంటామని వారు పేర్కొన్నారు. గతంలో ఎలాంటి పోరు మాటలను దృష్టిలో పెట్టుకోకుండా సమన్వయంతో కలిసి పనిచేస్తామని తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధి బాటలో నడవాలంటే ఎన్నో పదవులు చేపట్టిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఉండటమే మంచిదన్నారు. ఆయన అనుభవంతో నియోజకవర్గం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందని తెలిపారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డితో తమకు ఎలాంటి విభేదాలు లేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నేమాని వీర్రాజు, గంగాప్రసాద్, ప్రశాంత్ పటేల్, బంజే గంగారం, నారాయణ, మారుతిసేట్, జలాల్‌పూర్ సర్పంచ్ వెంకట్‌గౌడ్, ఎమ్‌డీ భారీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీసీసీ డెలిగేట్ డా.కూనిపూర్ రాజారెడ్డి

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెరిక శ్రీనివాస్



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

రైతుల ముఖాల్లో ఆనందం చూడడమే మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆశయమని మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నసురుల్లాబాద్ మండలంలోని అంకోల్ క్యాంప్‌లో నాయకులతో, రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. నసురుల్లాబాద్, బీర్కూర్, వర్ని, కోటగిరి మండలాల్లో ఇప్పటికే వరినాట్లు వేస్తున్నారని, నారుమల్లు పెరిగినా.. సాగునీరు లేకపోవడంతో రైతులకు జాప్యం జరుగుతుందని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి రైతులు తీసుకువెళ్లగా.. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమస్యను వివరించారని తెలిపారు. సాగునీరు విడుదలకు కృషిచేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నేడు నిజాంసాగర్ సాగునీటిని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి విడుదల చేశారని అన్నారు. తక్కువగా ఉన్న సాగునీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఒక్క చుక్క కూడా నీరు వృథా పోకూడదన్నారు. ఎప్పటికప్పుడు అధికారులు కెనాల్ కట్టపై పర్యటించి వివరాలు తెలుసుకోవాలన్నారు. వీరివెంట ఎంపీపీ పాల్త్యా విఠల్, సొసైటీ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

- చిత్రపటానికి నివాళులర్పించిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

మద్నూర్ : మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ నాయకులు ఆదివారం డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు తెప్పవారు తుకారం మాట్లాడుతూ డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కృష్ణ పటేల్, సంతోష్ తులావార్, సక్కర్లవార్ బాలకిషన్, కంచిన్వర్ యాదరావు, తమ్మేవార్ అజయ్, గడ్డివార్ తుకారాం, జి.శివాజీ, ఎ.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో డాక్టర్ శ్యాం ప్రకాష్ ముఖర్జీ బలిదానో దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మాసుల శ్రీనివాస్, జిల్లా సహాయక కన్వీనర్ దత్ రాములు, మండల ప్రధాన కార్యదర్శులు వడ్ల రామచందర్, చారి, మంగలి నవీన్ కుమార్, చేపూరి వంశీకృష్ణ, బొల్లారం క్రాంతి కుమార్, సీనియర్ నాయకులు రాజారామ్, నాగరాజ్, కుమ్మరి సాయిలు పాల్గొన్నారు.



మద్నూర్: చిత్రపటానికి నివాళుర్పిస్తున్న బీజేపీ నాయకులు



కామారెడ్డిలో...

కామారెడ్డి : బీజేపీ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు భారత్, కౌన్సిలర్లు శ్రీనివాస్, నరేందర్, నాయకులు వేణు, వెంకటి, ప్రతాప్, రజినీకాంత్, లింగం, శ్రీధర్, గోవర్ధన్, నరేష్, రాజగోపాల్, హరీష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బలిదాన్ దివాస్ కార్యక్రమాన్ని బీజేపీ మండల నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేష్, ప్రేమ్‌సింగ్, తానాజీ, మోహన్, వెంకటకృష్ణ, రవి, అశోక్, మహేష్, బాలరాజ్, నాయకులు, యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలను నిషేధించాలి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భ్రూణ హత్యలను నిషేధించాలని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోత్ ప్రేమ్ లాల్ అన్నారు. నిజామాబాద్‌నగరంలోని వినాయక నగర్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి సమాజంలో స్త్రీ, పురుషుల పాత్ర చాలా కీలకమైందని, ఎవరూ తక్కువ కాదని అన్నారు. అందుకు ప్రతి ఒక్కరు గర్భంలోనే ఉన్నప్పుడు ఆడ శిశువు, మగ శిశువు అని తెలుసుకొని తేడా చూడకుండా ఉండాలని తెలిపారు. ఆడ శిశువు అయితే వారిని గర్భంలో ఉన్నప్పుడే వారిని తుంచి వేయాలని ఆలోచనతో వ్యవహరిస్తున్నారని అన్నారు. భ్రూణ హత్యల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో అనిత లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన తెలంగాణ జన సమితి నాయకులు



నవతెలంగాణ లింగంపేట్

తెలంగాణ జన సమితి రాష్ట్ర విద్యార్థి విభాగం నాయకుడు నిజ్జన రమేష్ ముదిరాజ్ ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాదులోని ముఖ్యమంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. తెలంగాణ జన సమితి రాష్ట్ర విద్యార్థి విభాగం నాయకుడు తెలంగాణ జన సమితి ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ ఉద్యమ నాయకుడు నిజ్జన రమేష్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

వ్యవసాయ పనులు షురూ..



గడ్డిమందు చల్లుతున్న సాయిరెడ్డి

నవతెలంగాణ- మోపాల్

మండలంలో మూడు రోజుల నుండి వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. కాకపోతే వర్షపాతం అనుకూలత లేకపోవడం వల్ల బోరు బావుల దగ్గరనే నాట్లు జోరందుకుంటున్నాయి. చాలామంది రైతులు రోజు వర్షం కోసం నిరీక్షిస్తున్నారు, కుచన్‌పల్లి సాయి రెడ్డి అనే రైతు తమ పొలాలలో ఉండే బోరు బావి నీటితో పొలం నాటిన వెంటనే గడ్డి మందు చల్లుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుకు భూమి కన్నతల్లి లాంటిదని భూమికి బోరు బావి నీటి కంటే వర్షాపాతం నీటితో నాటిన మొక్కకి ఎదుగుదల ఉంటుందని దిగుబడి బాగా వస్తుందని అన్నారు. వర్షపాతం అనుకూలిస్తే మిగతా రైతులు కూడా పొలాల్లో నాట్లేసి చాలా సంతోషంగా ఉండేవారని ఆయన అన్నారు. మోపాల్ మండల గడిచిన రోజులు నుండి వర్షపాతం చాలా తక్కువ మోతాదులో నమోదు అయింది. ఈ మండలంలోని ప్రజలందరూ మొత్తం వ్యవసాయంపైనే ఆధారపడి ఉంటారు. ఒక రైతుకు నాట్లు వేసిన వెంటనే ఎంతో పని భారం తగ్గుతుంది. చాలా సంతోషంతో ఉంటారు.

ఉపాధ్యాయుల దశాబ్దాల కల నెరవేర్చిన ముఖ్యమంత్రి

నవతెలంగాణ-ఆర్మూర్

ఉపాధ్యాయుల దశాబ్దాల కల నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని పిఆర్‌టియు నాయకులు పెంట జలంధర్, పిడిలు మంచిర్యాల సురేష్ కుమార్, శ్యామ్, గోపి కొనియాడారు. 30 ఏళ్లుగా నోచుకోని భాషా పండితులు, ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లకు అవాంతరాలను అధిగమించి పదోన్నతులు కల్పించారని బదిలీలకు అవకాశం ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలో 22వేల మంది భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతులు వచ్చాయని, 60 వేల మంది టీచర్లు తాము ఉన్నచోట నుంచి మరొక ప్రదేశానికి బదిలీ కానున్నారని వారు తెలిపారు.

ఆర్యవైశ్య కాలేజ్ భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ చేయాలి

పీడీఎస్‌యూ




కాలేజ్ భూమిని సందర్శించిన నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

చిటిమెల హరిప్రసాద్ ఆర్యవైశ్య జూనియర్ కాలేజ్ అక్రమ రిజిస్ట్రేషన్ల పై ప్రభుత్వం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో బోర్గం బ్రిడ్జ్ వద్ద ఉన్న కాలేజ్ భూములను పిడిఎస్‌యూ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆర్యవైశ్య జూనియర్ కాలేజ్ ఏర్పాటు కోసం 4 ఎకరాల 22 గుంటల భూమిని కొనుగోలు చేశారని , 1994 లో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర్ రెడ్డి కాలేజ్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారని తెలిపారు. కొంత మంది స్వార్థపరుల వల్ల ఇప్పటి వరకు నిర్మాణం జరగలేదని, కాలేజ్ కోసం ఉన్న భూములు ఏమయ్యాయని , కాలేజ్ భూములు వ్యక్తుల పేర్ల మీద ఉన్నాయా? కాలేజ్ పేర్ల మీద ఉన్నాయా? అని ప్రశ్నించారు. కాలేజ్ భూములపై అర్బన్, రూరల్ ఎంఎల్ఏ లు స్పందించాలని అన్నారు. ఏ ఆశయ సాధన కోసం శంకుస్థాపన చేశారో ఆ ఆశయ సాధన కోసం ఆర్యవైశ్య జూనియర్ కాలేజ్‌ను నిర్మించి జిల్లా విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆర్.గౌతమ్ కుమార్ , జిల్లా ఉపాధ్యక్షులు కార్తీక్ , సహాయ కార్యదర్శి ప్రిన్స్, నాయకులు సాయినాథ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

నవతెలంగాణ-నందిపేట్



మృతిచెందిన గేదె

డొంకేశ్వరం మండలంలోని గాదేపల్లి గ్రామంలో 16 కెవి ట్రాన్స్‌ఫార్మర్ కు తగిలి సింగిరి నర్సారెడ్డి అనే రైతు గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. సుమారు లక్ష విలువ చేసే పాడి గేదే చనిపోవడంతో రైతు కుటుంబీలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన వేడుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ అధికారులు ఎటువంటి రక్షణ ఏర్పాటు చేయకపోవడంవల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్తులు విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనుమతి ఓ చోట.. అడ్మిషన్లు మరో చోట



నిర్మాణంలో ఉన్న ధ్రువ పాఠశాల భవనం

- బిల్డింగ్ పూర్తి కాకుండా అడ్మిషన్లు, పుస్తకాల అమ్మకాలు
- గ్రామ పంచాయతీ నుంచి ఇంటి నిర్మాణం కోసం అనుమతి
- స్కూల్ భవనంగా మార్చిన వైనం.. విద్యాశాఖ జీవో నెంబర్ 1 తుంగలో
- నిలువు దోపిడీ చేస్తున్న ధ్రువ ప్రవేట్ పాఠశాల యాజమాన్యం
- పట్టించుకోని విద్యాశాఖ, ఆందోళనలో తల్లిదండ్రులు.

నవతెలంగాణ-నందిపేట్

పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలన్న తపన ప్రైవేట్ విద్యా సంస్థలకు కాసుల వర్షం కురిపిస్తోంది. పోటీ ప్రపంచంలో కన్న బిడ్డలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్న తల్లిదండ్రుల కోరిక అటు ఉంచితే ప్రైవేటు పాఠశాలలు మాత్రం డబ్బుపై పెట్టిన శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్తుపై పెట్టడం లేదు.

ఉమ్మెడలో పాఠశాల.

మండలంలోని ఉమ్మెడ గ్రామంలో ధ్రువ పాఠశాల యాజమాన్యం జిల్లా విద్యాశాఖ నుంచి అనుమతి తీసుకొని విద్యార్థులకు బోధనను అందిస్తుంది. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో అదే పేరుతో అనుమతి ఉందని చెప్పి బైపాస్ పక్కన ఇంటి నిర్మాణం కొరకు పంచాయతీ నుంచి అనుమతి తీసుకుని ఓ భవనంలో త్వరలో ధ్రువ స్కూల్ ఇక్కడ ప్రారంభమని బోర్డు పెట్టి బిల్డింగ్ పూర్తికాక ముందే అడ్మిషన్లు చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు. తమ పాఠశాల మండలంలోనే ఉందని కొందరి తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తూ అడ్మిషన్లు చేస్తూ ఉమ్మెడలో నిర్వహిస్తున్న పాఠశాలకు బస్సులో పిల్లలను పంపిస్తున్నాడు. దీంతో విద్యార్థులు తమ బడి ఏ చోటని అయోమయాకి గురవుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్కూలు యజమాని వ్యవహరిస్తున్న విద్యశాఖ మాత్రం పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండల కేంద్రంలో నిర్మాణంలోనే ఉన్న భవనం అడ్మిషన్లు చేస్తు తరగతులు నిర్వహిస్తున్న భవనం ఇంకా నిర్మాణంలోనే ఉంది. మొన్నటి వరకు ఇంటి నిర్మాణంగా ఉన్న భవనం ఇప్పుడు పాఠశాల భవనంగా మారిపోయింది. భవనంపై అందరికి కనిపించే విదంగా పాఠశాల బోర్డును ఏర్పాటు చేశారు. లిఫ్ట్‌ను సైతం కొత్త భవనంలో యాజమాన్యం సిద్ధం చేసింది. కిటికీలు తలుపులు ఇంకా పెట్టనే లేదు. లోపల ప్రస్తుతం అస్తర్ కార్ (ప్లాస్టింగ్) నడుస్తోంది. చుట్టూ ప్రహరీ గోడ లేదు. 15 రోజులుగా విద్యార్థులకు నలంగాంగ ఉపాధ్యాయులతో బోధన చేస్తూ పుస్తకాలు ఇతర సామాగ్రి పంపిణీ చేసినట్లు స్థానికులు చెబుతున్నారు..



తలుపులు లేకుండా ఉన్న తరగతి గదులు.



కిటికీలకు సంచితో పరదా కట్టిన దృశ్యం

మండల కేంద్రంలో ధ్రువ పాఠశాల యజమాని భవన నిర్మాణం కాకముందే అడ్మిషన్లు, పుస్తకాల అమ్మకాలు జరుపుతున్నారని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డిని వివరణ కోరగా ఆయన ఫోన్ లో స్పందించలేదు. కిందిస్థాయి అధికారులను సంప్రదించగా ఉమ్మెడ గ్రామంతో పాటు మండల కేంద్రంలో కూడా పాఠశాల నడిపేందుకు అనుమతి తీసుకున్నారని తెలిపారు. అడ్మిషన్లు , పుస్తకాల అమ్మకాలు, కొత్త భవనంలో తరగతులు నిర్వహిస్తున్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు. భవనం పూర్తిగాక ముందే నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించిన పుస్తకాలు అమ్మిన తగిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ కింది స్థాయి అధికారులు పేర్కొన్నారు.

అనుమతికోసం కొన్ని ప్రాముఖ్యమైన నిబంధనలు

పాఠశాల అనుమతి కొరకు ఏడాది ముందే జిల్లా విద్యాశాఖ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి.

విద్యుత్ శాఖ ఇంజనీర్ ద్వారా సౌండ్ నెస్ సర్టిఫికెట్ పొందాలి.

ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోవాలి.

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి శానిటేజర్ సర్టిఫికెట్ పొందాలి.

ఓ ట్రస్టు లేదా సొసైటీ ఫామ్ చేయాలి.

గ్రామ పంచాయతీ నుంచి అనుమతి తీసుకోవాలి.

గ్రౌండ్ తప్పనిసరిగా ఉండాలి.

టీచర్ ట్రైనింగ్ ఉన్నవారికి మొదటగా ప్రాధాన్యత ఇవ్వాలి.

ఎన్ని బ్రాంచ్‌లు ఉన్న విద్యాశాఖ నుంచి రికగ్నేషన్ గుర్తింపు పత్రం తప్పనిసరిగా ఉండాలి.

ధ్యానంలో మేయర్

నవ తెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని సాయినగర్‌లోని బ్రహ్మ కుమారీలు విశ్వవిద్యాలయ మాతేశ్వరి జగదాంబ 59వ మమ్మా డే సందర్భంగా బెహన్‌జీ వనజ అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర్ మేయర్ దండు నీతు కిరణ్ హజరై బ్రహ్మకుమారీలతో కలిసి ధ్యానం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోరకై బ్రహ్మకుమారిలు ప్రజలలో ప్రేమ, దయ, కరుణ పెంపొందే విధంగా శాంతి వైపు నడవాలని దాని ద్వారా మానసిక ప్రశాంతత కలగుతుందని అన్నారు.



ధ్యానం చేస్తున్న మేయర్

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డును కైవసం చేసుకున్న కమ్మర్‌పల్లి విద్యార్థులు



అవార్డు అందుకున్న చిన్నారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని శ్రీ పరమేశ్వర నృత్య కళా నిలయంలోని కూచిపూడి నిత్య విద్యార్థులు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డును కైవసం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వత పరిషత్ వేదికగా కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య పోటీలలో శ్రీ పరమేశ్వర నృత్య కళానిలయం కూచిపూడి నాట్య గురువు గంట శిరీష వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు పాల్గొన్నారు. నాట్య పోటీల్లో పాల్గొన్న శాలిని గౌడ్, శివాని, హాసిని, శ్రీ లాస్య, అభిజ్ఞ, పూర్విత, వన్షిక, రిషిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డుతోపాటు నంది అవార్డును కైవసం చేసుకున్నారు. కీర్తి ఆర్ట్స్ అకాడమీ వారు నాట్య గురువు శిరీషకు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌తోపాటు నంది అవార్డుతో సత్కరించారు. తమ పిల్లలు సాధించిన విజయాన్ని చూసి తల్లిదండ్రులు, సభకు విచ్చేసిన ప్రముఖులు వర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ వేణుగోపాల చారి కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆర్గనైజర్ బిందులీమా విజేతలకు బహుమతులను అందజేశారు.

ఇజ్రాయిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అకోక్‌కు సంతాపం



నివాళ్లు అర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

డివిజన్ ప్రాంతంలో ఈనాడు అశోక్‌గా ప్రసిద్ధి చెందిన పాత్రికేయ మిత్రులు హఠాత్ మరణం చెందడం దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆదివారం ఇజ్రాయెల్‌లో ఆర్మూర్ ప్రాంతానికి చెందిన పలువురు మిత్రులు, శ్రేయోభిలాషులు అశోక్ చిత్రపటానికి నివాళులు అర్పించి అయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ తెలంగాణ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు , బోర్డు మెంబర్ బాణాల గంగాధర్ , కోశాధికారి తిరుపతి గౌడ్ మాట్లాడుతూ పత్రిక ద్వారా ఆర్మూర్, బాల్కొండ నియోజక వర్గాలకు సంబంధించిన అనేక సమస్యలను వెలుగులోకి తేవడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పరిష్కారం చేశారని అన్నారు. నిస్వార్థముగా స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రతి ఆదివారం నాలుగు సంవత్సలుగా నిరంతరాయంగా చేపట్టి అన్నివర్గాకల వారిని భాగస్వాములను చేసి విజయవంతంగా నిర్వహించి ఆదర్శనంగా నిలిచారని అన్నారు. రెండో విడతలో భాగంగా గత వారాలుగా స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే ఎంతో మందికి ఆదర్శనంగా నిలిచారని తెలిపారు. కొత్తగా పాత్రికేయ రంగంలోకి వచ్చేవారికి స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. ఆర్మూర్ ప్రాంతంలో ఎంతో మంది రాజకీయ నాయకులను ప్రోత్సహించి తీర్చి దిద్దారని తెలిపారు. అయన కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో సోమ రవి , బాణాల గంగాధర్ , తిరుపతి గౌడ్, సుల్ల నవీన్, ముంబై వివేక్, కరుణాకర్ గౌడ్, మల్లెల గంగాధర్, సుర్వి శ్రీనివాస్ గౌడ్, సట్ల సాయి, పెంబర్తి సురేష్, బోదాసు నారాయణ, తదితరులు పాల్గొని శ్రద్ధాంజలు ఘటించారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పునరుద్ధరించండి

- కొత్త లిఫ్ట్‌లను మంజూరు చేయండి
- మంత్రిని కలిసిన నియోజకవర్గ ఇన్చార్జ్

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గంలో చిన్న లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పనుల పునరుద్ధరణ కోసం, కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల విషయమై ఇటీవల రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు మండలాల లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పునరుద్ధరణ పై, కొత్త లిఫ్టులను మంజూరు చేయాలని కోరుతూ టెండర్లు పిలవడంపై ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. చిన్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలపై నందిపేట్ మండల కేంద్రంలోని నికాల్పూర్, మారంపల్లి, తల్వేద, వన్నెల్ (కే) పనుల పునరుద్ధరణ కోసం 4.83 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పథకాల ఆయకట్టు కింద 1,4056 ఎకరాలు లబ్ధి చేకూరుతుందన్నారు. వీటికి టెండర్లు పిలిచారని, కానీ అగ్రిమెంట్లు కుదరకపోవడంతో ప్రభుత్వం నుంచి మంజూరు కోరుతున్నట్లు తెలిపారు. ఆర్మూర్ మండలం మచ్చర్ల లో లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నిర్మాణంతో 2860 ఎకరాల ఆయకట్టు రూపొందించేందుకు ఈ పథకం ద్వారా 40.40 కోట్లు టెండర్లు పిలిచి ఏజెన్సీని ఖరారు చేయలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని 2860 ఎకరాల ఆయకట్టుకు ఈ పథకం దోహదపడుతుందని వివరించారు. అలాగే బినోల, కంఠం, చిక్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కింద నిజామాబాద్ జిల్లాలోని నవీపేట్, నందిపేట్, నందిపేట్ మండలంలోని ఎస్సారెస్పీ ముందు భాగంలో లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నిర్మాణానికి 79.85 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఈ పథకం ద్వారా మాక్లూర్, నందిపేట్ మండలాల్లోని 5155 ఎకరాల ఆయకట్టుకు పథకం దోహదపడుతుందని తెలిపారు. ఈ పథకం ప్రారంభించడానికి ప్రభుత్వం నుండి అనుమతి కోరుతున్నట్లు చెప్పారు. ధర్మోరా లిఫ్ట్ ఇరిగేషన్ పథకంతో (గుత్ప అదనపు పథకం) ద్వారా మాక్లూర్ మండలం ధర్మోరాలోని 1000 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు 11.71కోట్లతో నిజాంబాద్ జిల్లా పై లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నిర్మాణం మంజూరు అయ్యిందని, కానీ ఈ పథకం పనులు 50 శాతం పూర్తయ్యాయని, మిగతా పనుల నిర్మాణం కోసం ప్రభుత్వం సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కంబైండ్ లిఫ్ట్ ఇరిగేషన్ కొత్త పథకాన్ని ఆర్మూర్ మండలం ఫతేపూర్ సమీపంలోని ఎస్సారెస్పీ ఫోర్ షోర్ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం చేపడితే పత్తేపూర్ లో 3700 ఎకరాలు, చిట్టాపూర్ లో 3474 ఎకరాలు, సుర్బిర్యాల్ గ్రామాల్లో 2040 ఎకరాల వద్ద ఆయకట్టుకు నీరు అందుతుందని, ఈ పథక నిర్మాణం ఒప్పందం కుదిరి 18 నెలలు గడుస్తున్న పనులు నెమ్మదిగా సాగుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతోపాటు నిజామాబాద్ జిల్లా గుత్ప బ్యాలెన్సింగ్ ట్యాంక్ (మునుపెల్లి లిఫ్ట్) పై కొత్త పథకం ద్వారా స్కీం నిర్మాణానికి 23.80 కోట్ల ప్రభుత్వ పరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చిందని చెప్పారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా మాక్లూర్, ఆర్మూర్, జక్రాన్ పల్లి మండలాల్లోని 2423 ఎకరాల ఐడి పంటలకు నిరంతంచేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. అయితే అటవీ అనుమతుల కోసం ఏజెన్సీ గత 3 సంవత్సరాల నుండి పనులను నిలిపివేసిందని, స్టేజి 1 క్లియరెన్స్ లభించిందని, అటవీశాఖ అభివృద్ధి చార్జీల బిల్లు నిజామాబాద్ ఏపీఏఓ వద్ద 13.21 లక్షలు పెండింగ్లో ఉన్నాయని వాటి మంజూరు విషయమై ప్రభుత్వం దృష్టి సారించాలని మంత్రిని ఆయన కోరారు. నియోజకవర్గంలోని కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంల మంజూరు పెండింగ్లో ఉన్న పనుల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం వెంటనే చొరవపాలని ఆయన మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వినయ్ రెడ్డి తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వధూవరుల పరిచయ వేదికలో పాల్గొనడం అభినందనీయం



మాట్లాడుతున్న రవీంద్రచారి

నవతెలంగాణ-ఆర్మూర్

వధూవరుల పరిచయ వేదికలో పాల్గొనడం అభినందనీయమని విశ్వకర్మ ఫౌండేషన్ అధ్యక్షులు ఏ. రవీంద్ర చారి అన్నారు. విశ్వకర్మ వివాహ పరిచయవేదిక కార్యక్రమం లోని భాగంగా ఆదివారం పట్టణంలోని విశ్వ బ్రాహ్మణ సంఘంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఇంచార్జి మట్టెల ప్రవీణ్ చారి, జిల్లా స్వర్ణకార సంఘము అధ్యక్షులు శ్రీ తంగళపల్లి శ్రీనివాస్, , విశ్వబ్రాహ్మణ సంఘము అధ్యక్షులు పడకంటి భానుప్రకాష్, వేదా అధ్యక్షులు గద్దె గంగాధర్,మెట్పల్లి స్వర్ణకార సంఘ అధ్యక్షులు ఎ.శ్రీనివాస్ . సుమారు 100 మంది అమ్మాయిలు,అబ్బాయిలు పాల్గొని వారి వివరాలను నమోదుచేసుకున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | జూన్ 24, 2024 | www.navatelangana.com

తాండూర్‌లో ఘనంగా బోనాలు


బోనాలతో మహిళలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్


మండలంలోని తాండూరు గ్రామంలో ఆదివారం గ్రామస్తులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలను గ్రామంలో ఊరేగించి గ్రామంలో గల కట్ట మైసమ్మ ఆలయానికి చేరుకొని బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో ఘనంగా ఉర్సు


పూజలు చేస్తున్న ముస్లింలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని సాతెల్లి బేస్‌లో గల దర్గా వద్ద ఆదివారం సాయంత్రం హజరత్ సయ్యద్ నహీతబ్ షావలి ఉర్సు షరీఫ్ పండగ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకొని దర్గా వద్ద పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువుల అధ్వర్యంలో ప్రార్థనలు చేసి అక్కడి నుంచి ర్యాలీగా తహసిల్ కార్యాలయానికి చేరుకొని ఆనవాయితీ ప్రకారం అక్కడ ప్రార్థనలు చేస్తూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని, సిరిసంపదలు కలగాలని వేడుకున్నారు. అనంతరం తిరిగి దర్గా వద్దకు చేరుకొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు, తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.





కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లిగడ్డ

- కొండెక్కిన టమాట
- రెట్టింపైన ధరలు
- ఉల్లి కిలో రూ.40, టమాట రూ.80

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఉల్లిగడ్డ ధరలు ప్రజలకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. మండల కేంద్రంలోని అంగడిలో శనివారం ఉల్లిగడ్డ ధర కిలో రూ.40కి పెరిగింది. 100కు రెండు కిలోలనర అమ్ముతున్నారు. గత వారం చూసుకుంటే కిలోకు 20 రూపాయలు 100కు 5 కిలోలు వచ్చాయని ప్రజలు అంటున్నారు. ధర ఎందుకు పెరిగిందని వ్యాపారస్తులను ఆరాతీస్తే తెలంగాణలో లోకల్ ఉల్లిగడ్డ పంట లేదని తెలిపారు. వేరే ఉల్లిగడ్డ అయితే ఇక్కడివారు కొనుగోలు చేయరని, గుజరాత్ నుంచి మన లోకల్ ఉల్లిగడ్డను దిగుమతి చేసుకుంటున్నారన్నారు. ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు ఎక్కువ కావడంతో కిలో 40 రూపాయలు 100కు రెండు కిలోలన్నర అమ్ముతున్నట్టు వ్యాపారాలు తెలిపారు. ప్రతి వంటకంలో ఉల్లిగడ్డ అవసరం అవడంతో ప్రతి ఒక్కరు ఉల్లిగడ్డ కొలుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఉల్లిగడ్డను కొనాలంటే ప్రజలు ధరలు చూసి వెనుకడుగు వేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం స్పందించి కిలో 20 రూపాయలకు ఉల్లిగడ్డ అందజేయాలని ప్రజలు కోరుతున్నారు.

టమాల ధరసైతం రెట్టింపైంది. ఏకూర చేయాలన్న టమాట ఉండాల్సిందే. కిలో టమాట ధర 80 రూపాయలకు చేరింది. గతవారం సంతలో కిలో ధర 45 నుంచి 50 రూపాయలు పలికింది. ఈవారం కిలో 80 రూపాయలకు చేరింది. దీంతో ప్రజలు కొనుగోలు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. నిత్యావసరాలతోపాటు కూరగాయల ధరలు కూడా తగ్గించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-దోమకొండ

జాతీయస్థాయి ఖేలో ఇండియాలో ప్రతిభ చూపిన దోమకొండ మండల కేంద్రానికి చెందిన కదిరే సింధుజ, ఆర్చరీ స్పోర్ట్స్ కోటాలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన శ్రీధర్‌ను మండల కేంద్రంలోని గడి కోటలో ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీగల తిరుమల్‌గౌడ్, నాయకులు ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి ఖేలో ఇండియాలో సింధూజ ప్రతిభ చూపటంపై అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో ఆర్చరీ క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ కోటాతో చిన్న వయసులో ఉద్యోగం సాధించిన శ్రీధర్‌ను అభినందించారు. దోమకొండ ప్రాంత విద్యార్థులు ఆర్చరీ క్రీడా శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, కోచర్ ప్రతాప్‌దాస్, ఆర్చరీ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, సలహాదారులు పిన్నెం రామచంద్రం, పున్న లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం నర్సారెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. వరంగల్ డిక్లరేషన్‌లో గత ఎన్నికల హామీలో భాగంగా, శ్రీ రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం, మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్యాబినెట్ సమావేశాన్ని ఏర్పరిచి, రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఆదివారం వేల్పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంచి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ పార్టీ రైతులకు రుణమాఫీ చేస్తాం అని మాటచెప్పి రైతులను మోసం చేసింది కానీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు రుణమాఫీ చేస్తుంది. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ దామోదర్ గౌడ్, గ్రామ అధ్యక్షులు మల్లేష్, సహకార డైరెక్ట్ రాజేందర్, నరేంద్ర, రమణ, టాక్కరి గంగాధర్, స్వరూప ఇంద్రగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులకు అల్పాహారం పంపిణీ


వృద్ధులకు పండ్లు పంణీ చేస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్‌లో లాలన వృద్ధాశ్రమంలో వృద్ధులకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో అల్పాహారం ఆదివారం అందించారు. సమోసా, బిస్కెట్స్, పండ్లు వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు పట్వారి గోపి కృష్ణ మాట్లాడుతూ.. మా వంతు సేవలు ఆశ్రమాలకు ఎల్లప్పుడూ ఉంటాయని స్పాన్సర్ లక్ష్మీనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పట్వారీ తులసి, రోటరీ మాజీ అధ్యక్షులు పుష్కర్ రావు, ప్రవీణ్ పవార్, చౌటి లింబాద్రి, ఆశ్రమ సిబ్బంది సత్యం, తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

- నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలి : ఎన్ఎస్‌యుఐ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎన్డీఏ ప్రభుత్వ దిష్టిబొమ్మను ఆదివారం తెలంగాణ యూనివర్సిటీ ఎన్ ఎస్ యు ఐ విద్యార్థి సంఘం అద్వర్యంలో యూనివర్సిటీ లోని మెయిన్ గేట్ వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా ఎన్ ఎస్ యుఐ యూనివర్సిటీ అధ్యక్షుడు కొమిర శ్రీశైలం, ఉపాధ్యక్షులు సాగర్ నాయక్ మాట్లాడుతూ నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన పరీక్ష పేపర్ లీకైనందున మరోసారి నిర్వహించాలని పేర్కొన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ పై అనాటి నుండి నేటి వరకు ప్రధాన మంత్రి

నరేంద్ర మోడీ, ప్రభుత్వం స్పందించలేదని,లికేజ్ కు కారణమైన నిందితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. దేశ భవిష్యత్తుతో మోడీ చెలగాట మాడడం సరికా దన్నారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థుల పరీక్షలో పేపర్ లీకేజ్ అనేది సరైన పద్ధతి కానే కాదని, కానీ బీజెపి అధికారంలో ఉన్నటువంటి రాష్ట్రాల్లో నే ఎందుకు పేపర్లు లీకేజీలు అవుతున్నాయని ప్రశ్నించారు. దేశంలో మోడీ ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికి వదిలేసి మాయా ఫకీరు మాటలు చెబుతూ పుట గడపాలని చూస్తుండడం సరికాదన్నారు. తక్షణమే నీట్ లీకేజీ పై సుప్రీంకోర్టు జాడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వామి, జిల్లా అధ్యక్షులు వేణు రాజు, నిజామాబాద్ రూరల్ అధ్యక్షులు అశిష్, యూనివర్సిటీ కార్యదర్శులు రాజేందర్, శ్రీను రాథోడ్, నవీన్, మహేష్, అనిల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ టేకులపల్లి వినీత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పర్వన్న తెలిపారు. సంబంధిత శాఖ అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

27వ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయండి

- లంబాడి హక్కుల పోరాట సమితి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జులై 1 న హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరుగు జాతీయ లంబాడి హక్కుల పోరాట సమితి 27వ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయండి అని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు చౌహన్ మోహన్ నాయక్ అన్నారు. ఆదివారం నిజామాబాద్ ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 27 సంవత్సరాల కిందట సామాజిక ఉద్యమాల ఆవిర్భావానికి నాందిగా ఏర్పడిన లంబాడి హక్కుల పోరాట సమితి 28వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జాతీయస్థాయి బంజారా సమ్మేళనం సభను జూలై 1న హైదరాబాదు లోని రవీంద్ర భారతిలో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభ కు విద్యావంతులు, గిరిజన మేధావులు, ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పక్షాల నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమాజంలో అత్యధిక సంఖ్యలో ఉన్న బహుజన సామాజిక వర్గాలకు జరుగుతున్న సామాజిక ఆర్థిక అణచివేతకు వ్యతిరేకంగా ఏర్పడిన లంబాడి హక్కుల పోరాట సమితి, లంబాడీలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని అన్నారు. ఉద్యమాల ఫలితంగానే గిరిజన సమాజంలో అనేక సమూలన మార్పులు తీసుకురావడం జరిగిందని అన్నారు. లంబాడి హక్కుల పోరాట సమితి పాత్రను మరువలేమని సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే నేడు గిరిజన గ్రామాలు తండాలను గూడాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా చేసుక్నున్నమని అన్నారు. రాజ్యాంగం ప్రకారం సాధించిన ప్రసాదించిన 10 శాతం రిజర్వేషన్లను తెలంగాణ రాష్ట్రంలో సాధించుకున్నాం అని ఈ స్ఫూర్తితోనే, జాతీయ స్థాయిలో బంజారా లందరూ, ఒకే జాతిగా ఉన్న వారు మాట్లాడుతున్న గోర్ బోలి భాష అందరికీ ఒకటేనని, అందుకోసం గోరుబోలిని ఎనిమిదో షెడ్యూల్లో చేర్చేందుకు జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని నిర్మాణం చేసేందుకు ముందుకు పోదామని అన్నారు. కార్యక్రమంలో భీంగల్ మండల అధ్యక్షుడు సేవలాల్ నాయక్, నిజాంబాద్ రూలర్ యువ మండల అధ్యక్షుడు బనావత్ ప్రేమ్ దాస్, భీంగల్ మండల యూత్ ప్రెసిడెంట్ రమేష్ నాయక్, బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ వల్లి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు

ఉద్యమ కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణ ఉద్యమ కుటుంబానికి చెందిన ఉద్యమకారుడు మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ యాదవ్, కిషన్ యాదవుల తండ్రి గొల్ల నరసయ్య మృతిచెందగా, వారి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి, నాయకులు గిరిరెడ్డి మహేందర్‌రెడ్డి, నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బండి పోచయ్య, నారెడ్డి రాజిరెడ్డి తదితరులున్నారు.